క్లుప్తంగా

ఘనంగా విష్ణువర్ధన్‌రెడ్డి జయంతి



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే చిన్న కుమారుడు గూడెం విక్రమ్

పటాన్‌చెరు: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పెద్ద కుమారుడు కీర్తిశేషులు విష్ణువర్ధన్‌రెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితో పాటు నందిగామ గ్రామంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ యువసేన, జీవీఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

జహీరాబాద్ తహసీల్దార్‌గా రవీందర్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ తహసీల్దార్‌గా రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్‌గా ఉన్న స్వామి బదిలీ కావడంతో రంగారెడ్డి జిల్లా నవాబ్‌పేట తహసీల్దార్‌గా ఉన్న రవీందర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు కార్యాలయంలో చార్జీ తీసుకున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

న్యాల్‌కల్(జహీరాబాద్): తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతాంగానికి వరి, శనగ వంటి నాణ్యమైన విత్తనాలను పీఏసీఎస్‌ల ద్వారా అందజేస్తామని ఆ సంస్థ రీజినల్ మేనేజర్ కోటిలింగం అన్నారు. సోమవారం న్యాల్‌కల్‌లో మేలురకం విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉండే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఆసీఫ్, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, సిబ్బంది బస్వరాజ్, యూనూస్‌ఖాన్ పాల్గొన్నారు.

అధ్యాపకుడు నాగరాజ్‌కు డాక్టరేట్

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బొంగుల నాగరాజ్ డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ మాట్లాడుతూ లెక్చరర్ నాగరాజ్ జంతుశాస్త్ర విభాగంలో లోఆన్ ఇంపాక్టల్ స్టడీ ఆఫ్ హెవీ మెటల్స్ ఆన్ ఆక్వాటిక్ ఏఖో సిస్టం అండ్ ఎంజీమీటిక్ ఆక్టివిటీ, అఖుట్ టాసిక్ ఎఫెక్స్ ట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఫిషస్‌ే అంశంపై పరిశోధనలు చేశారన్నారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మోనాడ్ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందారని తెలిపారు. అనంతరం నాగరాజ్‌ను కళాశాలలో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు శంకుతల, సురేందర్, రాములు, ప్రీతి, విష్ణు ప్రియ, సౌభాగ్య, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

రాయికోడ్(అందోల్): మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన సార రాహుల్ నాలుగు నెలల క్రితం మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు సీఇఐఆర్ పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోగా అక్రమంగా ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రాహుల్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఫ్యాన్ల బహూకరణ

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు సునీతమ్మ సేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శివశంకరరావు ఆధ్వర్యంలో సోమవారం 30 సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సునీతమ్మ సేవ స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ధర్నా

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదలకు సమయానికి ఆర్టీసీ బస్సులు రావటం లేదని సోమవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. 2 గంటల పాటు విద్యార్థులు, యువకులు ధర్నా చేపట్టారు. ఉదయం సమయంలో బస్సులు సమయానికి రాకపోవటంతో కాలేజీలు, పాఠశాలలకు వెళ్ల లేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు మద్దతు తెలిపారు. కాగా పోలీసులు జోక్యం చేసుకొని ధర్నా విరమింపజేశారు.

కళా ప్రదర్శన

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి తండాలో సోమవారం సాంస్కృతిక సారథి బృందం కళా ప్రదర్శన ఇచ్చారు. కళాకారులు అయిదాల సునీల్, నీరుడి దుర్గేష్, డప్పోళ్ల రమేష్, భామిని, నవీన్, మల్లేశ్, గొని శంకర్ తదితరులు ఆటపాటలతో ప్రభుత్వ గురుకులాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక సేవలు

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- నవజాత శిశువు ఫొటో తెరపి కేంద్రం ప్రారంభం



నవజాత శిశువు ఫొటో తెరపి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ బార్న్ సస్టైనబుల్ యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన వార్డులో నవజాత శిశువులకు తొలి రోజుల్లో వచ్చే వైద్య సమస్యలకు అత్యాధునిక వైద్యం లభిస్తుందని తెలిపారు. ఇటీవల సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వసుంధర, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు శీనయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎం సహాయనిధి

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని భవానీపురం కాలనీకి చెందిన లక్ష్మి, డివిజన్ పరిధిలోని జేపీ కాలనీకి చెందిన సాయికిరణ్‌రెడ్డికి ఎల్‌ఓసీ పత్రాలను క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, బీఆర్ఎస్ పటాన్‌చెరు మండల అధ్యక్షుడు పాండు, కౌన్సిలర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ కోర్సులు

పటాన్‌చెరు: ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులు అందించనున్నట్టు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. జీవీఆర్ ఫ్రీ స్కిల్స్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా సీ, సీప్లస్ ప్లస్, పైథాన్, జావా, వెబ్ టెక్ తదితర అంశాల్లో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిరోజు సాయంత్రం క్లాసులు నిర్వహించనున్నట్టు వివరించారు. పూర్తి వివరాలకు ఊశయ్య (8978064011), శ్రవణ్ కుమార్ (9177378737)ను సంప్రదించాలని సూచించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

- బీఆర్ఎస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్



విద్యార్థులతో మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నీలం మధు తన సొంత నిధులతో రాగిజావ తాగేందుకు కావాల్సిన గ్లాసులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం బొల్లారంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఎంఆర్ మహిళా విభాగం కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేందర్‌రెడ్డి, శంకర్, కృష్ణ, మహేష్, నాగరాజు, రాజు, యాదగిరి పాల్గొన్నారు.

గురుకుల వసతి గృహానికి సామగ్రి అందజేత

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో మైనారిటీ గురుకుల సాంఘిక సంక్షేమ వసతి గృహానికి కుర్చీలు, బెంచీలు, బీరువాలు, టేబుళ్లను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధావన్, తన్వీర్, రహీమ్, సంజీవ్, దానయ్య, పాండు, రాజు, రవి, సురేష్, మని, శేఖర్, కిషోర్, సాయి, శ్రీకాంత్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సర్వాయి జయంతిని అధికారికంగా నిర్వహించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: సర్వాయి పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌ఓ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ సంగారెడ్డిలో ఈ నెల 18వ తేదీ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా కలెక్టర్ ఆడిటోరియంలో సభ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అంజన్నగౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందోల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో..

వట్‌పల్లి(అందోల్): సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం అందోల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు లక్ష్మీనారాయణగౌడ్ అధ్యక్షతన అమరవీరుల యాదిలో.. సామాజిక చైతన్యయాత్ర సభ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్నగౌడ్, జిల్లా కమిటీ సభ్యులు కుమార్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రాచకొండ రత్నంగౌడ్, మాజీ ఎంపీటీసీ, సుధాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కాశిదాసుగౌడ్, నాయకులు శంకర్‌గౌడ్, గంగన్నగౌడ్, లక్ష్మణ్ గౌడ్, మానే గౌడ్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్



చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సదాశివపేట మండల పరిధిలోని మూభాకర్‌పూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం మూబారక్‌పూర్ బి గ్రామాన్ని ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా మూభారక్‌పూర్ సర్పంచ్ శ్రీవాణిదశరథ్ అధ్వర్యంలో సోమవారం మూభారక్‌పూర్ బి గ్రామ ప్రజలు చింతా ప్రభాకర్ కలిసి ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడీల సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బేగరి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు శోభ



త్రివర్ణ రంగుల పూలహారాలు

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు జెండా పండుగకు ముస్తాబు అయ్యాయి. త్రివర్ణ పతాకాలు, పూలమాలలు, కలర్ పేపర్లు, బ్యాడ్జీలు, థర్మకోల్ కటింగ్, బాల్స్, రేడీమేడ్ త్రీకలర్ పేపర్స్, కాగితపు ప్లాస్టిక్ తోరణాలు తదితర అలంకరణ సామగ్రి, సమర యోధుల చిత్రపటాలను షాపుల యజమానులు సిద్ధం చేశారు. ఆయా దుకాణాల వద్ద విద్యార్థులు, యువత చేరికతో సందడిగా మారాయి.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థికసాయం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముంబై జాతీయ రహదారిపై సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు సంగారెడ్డి మార్బల్, గ్రానైట్, టైల్స్ అసోసియేషన్ తన వంతుగా రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు సోమవారం సంగారెడ్డి రూరల్ సీఐ సుధీర్‌కుమార్‌ను కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఈ సీసీ టీవీ కెమెరాలతో గణేష్‌గడ్డ గణపతి ఆలయం నుంచి పెప్సీ కంపెనీ వరకు నిరంతరం నిఘా ఉంటుందన్నారు. సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన మార్బల్ గ్రానైట్ అసోసియేషన్ నాయకులను సుధీర్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నరేందర్‌చౌదరి, ఉమేష్, శివారెడ్డి, హేతన్‌సింగ్, అల్‌అఫీజ్ పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలి

జహీరాబాద్ టౌన్: గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని పీడీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు ఇప్పటివరకూ నోట్‌బుక్స్ పంపిణీ చేయలేదన్నారు. 2020 నుంచి కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వడంలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని జోగిపేట నెహ్రూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అడవిరాజు అన్నారు. సోమవారం కళాశాలలో దోస్త్ ద్వారా 2023–24 సంవత్సరానికి గాను అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థుల వివిధ రకాల గేయాలు, కవితలు, విషయజ్ఞానానికి సంబంధించిన ఆర్టికల్స్ పొందపరిచిన కళాశాల వార్షిక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లలిత, అకాడమిక్ కోఆర్డినేటర్ గోపాల్, అధ్యాపకులు పాండరి, శ్రీకాంత్, శ్రీప్రియ, సరితరాణి, శైలజ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మనూరు(నారాయణఖేడ్): ప్రపంచ మానవ హక్కుల సంస్థకు సంబంధించి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మనూరు మండలం తోర్నాల్ గ్రామానికి చెందిన డిగ్గె బాబును నియమిస్తూ ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నవోదయసిద్దు నియామకపత్రం అందించారని డిగ్గెబాబు సోమవారం తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పజెప్పారన్నారు. జిల్లాలో మానవ హక్కులకు పరిరక్షణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డిలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆజాది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు గడుస్తున్నా దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమై పోయిందన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశాన్ని రక్షించుకోవాలంటే మతోన్మాద ముసుగులో రాజకీయాలు చేస్తున్న వారిని తరిమికొట్టే విధంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి రజినీకాంత్ నాయకులు నర్సింలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులకు ప్లాట్లు పంపిణీ చేయాలి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని దామర్‌గిద్దా గ్రామంలోని 6.15 ఎకరాల భూమిని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహశీల్దార్ మహ్మద్ జుబేర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్లాట్ల పంపిణీలో డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోయారు. మాజీ సర్పంచ్ దత్తురావు, రాంచందర్‌రావు, మారుతిరావు, గంగారాం పాల్గొన్నారు.

విభజన దివస్ మౌన ప్రదర్శన

కొండాపూర్(సంగారెడ్డి): దేశ విభజన సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని సోమవారం బీజేపీ నాయకులు మౌన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి జిల్లా కేంద్రంలోనూ విభజన దివస్ మౌన ప్రదర్శన నిర్వహించామని జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేశ్వరరావు దేశ్‌పాండే కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి దశలవారీగా నిధులు

పటాన్‌చెరు: మున్సిపల్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి దశలవారీగా నిధులు కేటాయిస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు, టైలర్స్ కాలనీలో రూ.49 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాలనీలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీమేరకు నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. అనంతరం 17వ వార్డు లక్ష్మి నివాస్ కాలనీలో కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు. హరితహారంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, కల్పనా ఉపేందర్‌రెడ్డి, యూసుఫ్, చంద్రకళ గోపాల్, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

వట్‌పల్లి(అందోల్): లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలని లయన్స్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో 2023–24 సంవత్సరానికి గాను జోగిపేట లయన్స్ క్లబ్ 49వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 14లక్షలకు పైగా సభ్యత్వాలు కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ రీజియన్ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ విజయ్‌కుమార్, కో చైర్మన్ యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

జోగిపేట లైన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేరి సంగారెడ్డి, కార్యదర్శిగా అల్లే శ్రీకాంత్, కోశాధికారిగా రవిశేఖర్‌రెడ్డి, వీఆర్వోగా రాంబాబు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్ (రాజు), మాణిక్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సంతోష్‌తో డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైనవారిని డాక్టర్ రవీందర్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎం దిష్టిబొమ్మ దహనం

వట్‌పల్లి(అందోల్): అర్హులైన వారికి దళితబంధు ఇవ్వడం లేదని, అనర్హులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని సోమవారం అందోల్ మండల పరిధిలోని అన్నసాగర్ ప్రధాన రహదారిపై దళితులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న జోగిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు.

◆ డబ్ల్యూహెచ్ఆర్‌పీసీ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా డిగ్గెబాబు

నారాయణఖేడ్: వరల్డ్ హ్యూమెన్‌రైట్స్ పీపుల్స్ కౌన్సిల్ సంస్థ జిల్లా అధ్యక్షులుగా మనూరు మండలం తోర్నాల్‌కు చెందిన డిగ్గెబాబు నియమకమయ్యారు. ఈ మేరకు సోమవారం డబ్ల్యూహెచ్ఆర్‌పీసీ రాష్ట్ర అధ్యక్షులు నవోదయ సిద్దు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలో డిగ్గెబాబును సన్మానించారు.

◆ సీఎం కేసీఆర్ మాటలతో మోసపోవద్దు

సదాశివపేట(సంగారెడ్డి): శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్నందునా ముఖ్యమంత్రి కేసీఆర్ మాటల గారడీలను ప్రజలు నమ్మి మరోసారి మోసపోవద్దని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పోరాటాలను ఉక్కుపాదంతో అణగదొక్కిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని వర్గాల ప్రజలను మోసం చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వ భూములను అమ్మివేసి తైలాలు ప్రకటిస్తున్నాడని ఆరోపించారు. ఇదివరకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాధిక్, తుమ్మపూడి బుజ్జమ్మ, మహిళ సమాఖ్య కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రనగర్ చౌరస్తా వద్ద సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు గద్దర్ సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, పార్టీ నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

◆ స్వచ్ఛందంగా మొక్కలు నాటాలి

జిన్నారం(పటాన్‌చెరు): హరితహారంలో భాగంగా ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని గుమ్మడిదల ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిదిలోని అన్నారం గ్రామంలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి, అన్నారం శివారులోని దుండిగల్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీలో పర్యటించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ సురేష్, రైల్వేశాఖ అధికారి రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ బాలవిహార్ పార్కును అభివృద్ధికి చేస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ బాలవిహార్ పార్కును అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. సోమవారం పార్క్ అభివృద్ధిలో భాగంగా వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

◆ గీతం ఆధ్వర్యంలో నోటుబుక్స్ పంపిణీ

పటాన్‌చెరు టౌన్: పట్టణ పరిధిలోని రుద్రారం, ఇంద్రకరణ్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలతో పాటు కందిలోని మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్‌లో సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వాహకులు విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ కిట్స్ పంపిణీ చేశారు. గీతమ్‌ను ఈ క్లబ్, జాతీయ సేవా కార్యక్రమం (ఎన్ఎస్ఎస్), వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ)లు సంయుక్తంగా నిర్వహించిన ఈ పుస్తక వితరణ కార్యక్రమంలో ప్రొఫెసర్ త్రినాథరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్తలు డాక్టర్ సీవీ నాగేంద్రకుమార్, డాక్టర్ టీబీ పాత్రుడు, డాక్టర్ బిజయ్‌కేతన్, స్టూడెంట్ లెఫ్ట్ మేనేజర్ సమీర్‌ఖాన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ యువతి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యువతి అదృశ్యమైన సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సైబర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సైబర్‌కాలనీలో నివాసముండే ప్రజ్ఞప్రియ ప్రైవేట్ పరిశ్రమల్లో ఉద్యోగిగా పనిచేస్తోంది. కాగా ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి జన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులు నాగులపల్లి నివాసముండే సత్యనారాయణ కొల్లూరులో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సత్యనారాయణ తిరిగి ఇంటికి రాలేదు. మరుసటి రోజు 11వ తేదీన అతని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంటికి వస్తానని తెలియజేశాడు. కాగా ఈ నెల 9వతేదీన అప్పు తీసుకున్న వ్యక్తి సత్యనారాయణకు రూ.50 వేలు ఇచ్చిన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ డబ్బులు తీసుకువెళ్లిన సత్యనారాయణ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

◆ ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 1995–96బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు కౌన్సిలర్ శ్రీశైలం, పాండు, ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీహరి, ఆంజనేయులు, నరసింహారెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

